## కోర్టుకు క్షమాపణ చెప్పిన ఐఎఎస్‌లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోర్టు ధిక్కరణ కేసుల్లో ఇద్దరు ఐఎఎస్ అధికారులు హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌లు ఫాం–1 నోటీసులు జారీ చేసినా హాజరు కాకపోవడం, బెయిలబుల్ వారెంట్లు జారీ అయినా కోర్టుకు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిద్దరూ వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసిన తర్వాత అధికారులు విదేశాలకు ఎలా వెళతారని హైకోర్టు తప్పుపట్టింది. వాళ్లను ఎయిర్‌పోర్టులో పోలీసులు అరెస్ట్ చేస్తే పరిస్థితి ఏమిటని అడిగింది. భూసేకరణ పరిహారానికి సంబంధించి కింది కోర్టు నిర్ణయించిన మొత్తంలో 50 శాతం సొమ్మును మూడు నెలల్లో డిపాజిట్ చేయాలంటూ గత ఏడాది ఏప్రిల్ 24న ఇచ్చిన ఉత్తర్వుల అమలులో జాప్యంపై జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన నాగిరెడ్డి తదితరులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లను జస్టిస్ ఎఒన్ .వి.శ్రవణ్‌కుమార్ సోమవారం విచారించారు. కావాలని కోర్టు ఆదేశాల్ని ఉల్లంఘించలేదని ప్రభుత్వ ప్లీడర్ చెప్పారు. వారెంట్ రీకాల్, హాజరు మినహాయింపు కోరుతూ పిటిషన్లు దాఖలు చేశామని తెలిపారు. సుల్తానియా విదేశాలకు వెళ్లడంతో తన సూచన మేరకు మరో అధికారి వివరాలతో కౌంటర్ దాఖలు చేశారని చెప్పారు. ఇద్దరు అధికారులు కోర్టును క్షమాపణ కోరుతూ అఫిడవిట్‌లు దాఖలు చేయడంతో కోర్టు ధిక్కరణ పిటిషన్లపై విచారణను ముగించింది.

## మహిళా ఎమ్మెల్యేను అసెంబ్లీలోకి అనుమతించాం : శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు చోటుచేసుకున్న ఉద్రిక్తతకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే కారణమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ముద్రించిన టీషర్టులు ధరించి శాసనసభకు రావడం ఉద్దేశపూర్వక చర్యేనని, నిబంధనలు తెలిసినప్పటికీ ప్రచారం కోసం బిఆర్‌ఎస్ సభ్యులు ఈ విధంగా వ్యవహరించారని అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. పోలీసులతోనే బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసభ్యంగా ప్రవర్తించారని, యూనిఫాంలో ఉన్న పోలీసుల గల్లాలు పట్టుకున్నారని ఆరోపించారు. అసెంబ్లీకి ఎమ్మెల్యేలు ఏ రంగు దుస్తులు ధరించి అయినా రావచ్చని, అయితే వాటిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, రాజకీయ సందేశాలు ఉండకూడదని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ఈ విషయంలో గతంలోనూ స్పీకర్ రూలింగ్స్ ఉన్నాయని తెలిపారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు అసెంబ్లీ నిబంధనలు పూర్తిగా తెలుసని, అయినప్పటికీ కావాలనే నినాదాలు ఉన్న టీషర్టులు ధరించి వచ్చి వివాదం సృష్టించారని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అనుమతించలేదన్న ఆరోపణలను మంత్రి ఖండించారు. టీషర్టులు ధరించని మహిళా శాసన సభ్యులను పోలీసులు అనుమతించారని, అయితే వారి వెంట నినాదాలు ఉన్న టీషర్టులు ధరించిన ఇతర ఎమ్మెల్యేలు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అగౌరవంగా వ్యవహరించారన్న బిఆర్‌ఎస్ ఆరోపణలపై స్పందిస్తూ.. ఘటనకు సంబంధించిన సిసి కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తామని శ్రీధర్‌బాబు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి ఈ ఘటనపై నివేదిక కోరారని, సిసి కెమెరాల దృశ్యాలను పరిశీలించిన అనంతరం వాస్తవాలను నివేదిక రూపంలో అందజేస్తామని చెప్పారు.

## సిఎం క్షమాపణ చెప్పాలి


కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు చావు డప్పు కొడుతున్నారు : బిఆర్‌ఎస్ నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి




**ప్రజాపక్షం/యాదాద్రి:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం కాదు, ముందుగా పాలనలో పూర్తిగా విఫలమైన ముఖ్యమంత్రే రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి స్పష్టం చేశారు. కెసిఆర్ ఫామ్ హౌజ్ ముందు చావు డప్పు కొడతామంటున్న కాంగ్రెస్ నాయకులు ముందుగా క్షేత్రస్థాయికి వెళ్లి చూడాలని, అక్కడ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికే చావు డప్పు కొడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. అధికార మత్తులో ఉండి కాంగ్రెస్ నాయకులు ఇంకా మేలుకోలేకపోతున్నారని కల్లూరి రామచంద్ర రెడ్డి విమర్శించారు. ప్రజాసమస్యలపై నిలదీస్తున్న బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. సభకు వస్తున్న మహిళా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీత లక్ష్మారెడ్డి చీర కొంగు లాగి ప్రవర్తించిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అణచివేత ధోరణి వీడి, ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని, లేని పక్షంలో ప్రజల నుంచి తీవ్ర నిరసనలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

## సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయ్ రాములు సతీమణి మృతి

నివాళులు అర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ప్రజాపక్షం/అమరచింత :** సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయ్ రాములు సతీమణి కే.జ్యోతి క్యాన్సర్ మహమ్మారితో సోమవారం తెల్లవారు జామున మృతి చెందారు. గత నెల రోజులుగా క్యాన్సర్ వ్యాధితో హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం జ్యోతి మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమె భౌతికకాయాన్ని అమరచింతలోని స్వగృహానికి తీసుకువచ్చారు. ఆమె మరణంతో సిపిఐ శ్రేణులు తీవ్ర విషాదానికి గురయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ మాస్ లైన్, కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి నాయకులు హాజరై మృతురాలి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. జ్యోతి అంతిమ యాత్రలో కూనంనేనితో పాటు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదిర్శ జాన్ స్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనరసింహ, సిపిఐ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూమ్ భవన్‌లో సుదీర్ఘకాలం పనిచేసిన చెన్నయ్య మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పరామర్శించారు.

# మల్లారెడ్డి మరణం తెలంగాణ రైతాంగానికి తీరని లోటు

సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో సిఎం రేవంత్‌రెడి, ప్రకాశ్ కారత్, కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయంలో నేల సారం నుంచి పంట మార్కెటింగ్ వరకు నిశిత అవగాహన ఉన్న వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని, అందుకే ఆయనను ఓ 'వాకింగ్ ఎన్సైక్లోపీడియా' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. సోమవారం సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ(ఎం) అగ్ర నాయకులు , అఖిల భారత కిసాన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ రవీంద్రభారతిలో జరిగింది. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి మహ్మద్ అజారుద్దీన్, సిపిఐ(ఎం) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కారత్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ జన సేన అధ్యక్షుడు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకత్వం ఎస్.వీరయ్య, టి.జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, సిపిఐ(ఎం) ఎపిరాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వామపక్ష పార్టీల నేతలు పోటు రంగావు, కె.గోవర్ధన్, వనం సుధాకర్, సి.హెచ్ మురహరి, రమేశ్ రాజాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సారంపల్లి మల్లారెడ్డి చిత్ర పటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వామపక్ష పార్టీల నేతలు పూలమాలలు వేసి రెండు నిమిషాలు పాటు మౌనం పాటించి ఘనంగా శ్రద్ధాంజలి ఘంటించారు. అదేవిధంగా సారంపల్లి మల్లారెడ్డి స్వయంగా రచించుకున్న ఆయన ఆత్మకథ , 'నాగేటి సాళ్లు' అనే పుస్తకాన్ని ప్రకాశ్‌కారత్ ప్రజానాట్యమండలి రచించిన మల్లారెడ్డి స్మృతి గీతాల సిడిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.

### మల్లారెడ్డి మరణం తెలంగాణ రైతాంగానికి తీరని లోటు : సిఎం రేవంత్‌రెడ్డి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 6 దశాబ్దాల పాటు గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి వరకు రైతు కూలీలు, కౌలు రైతులు, భూమి, నీరు, విత్తనం, మద్దతు ధర, కోసం ప్రభుత్వ విధానాలపై నిరంతరం పోరాడిన మల్లారెడ్డి మరణం తెలంగాణ రైతాంగానికి తీరని లోటని పేర్కొన్నారు. మల్లారెడ్డి రాసిన పుస్తకాలు, లేవనెత్తిన అంశాలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారానికి ముందుకు వెళ్తోందని తెలిపారు. కమ్యూనిస్టులు క్షేత్రస్థాయిలో పోరాడితే కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటికి చట్టబద్ధత కల్పించాయని గుర్తుచేశారు. రైతు వ్యతిరేక చట్టాలపై కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి ఉమ్మడిగా పోరాటం వల్లే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనక్కి తగ్గడమే కాకుండ రైతులు క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తూ రాష్ట్రంలో దాదాపు కోటి ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందని, ప్రతీ బూత్ స్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడుకోవాలని ప్రజలకు, కమ్యూనిస్టులకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

### మల్లారెడ్డి నిరాడంబర జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శం : ప్రకాశ్ కారత్

రైతాంగం, గ్రామీణ పేదల సమస్యలపై మల్లారెడ్డికి ఉన్న లోతైన అవగాహన, నిరాడంబర జీవితం కమ్యూనిస్టులకు ఆదర్శమని ప్రకాశ్ కారత్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థ పరిరక్షణ కోసం పోరాడటమేనని మల్లారెడ్డి ఆశయాలకు ఆయనకు మన మిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగంపై తీవ్ర దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాల సవరణ పేరుతో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని విమర్శించారు. తెలంగాణలోనూ భారీగా ఓటర్ల పేర్లు తొలగించారని, దీనిపై ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

### సారంపల్లి ఓ సుగుణాల రాశి : కూనంనేని

రైతు సంఘం అగ్ర నేత సారంపల్లి మల్లారెడ్డి అతి సామాన్యుడులో అతి సామాన్యుడు అని ఆయన ఓ సుగుణాల రాశి అని కూనంనేని సాంబశివరావు కొనియాడారు. ఒక టీచర్, ఒక ఇంజనీర్, ఒక రైతు, ఒక కమ్యూనిస్టు విప్లవకారుడి కలబోతే మల్లారెడ్డి అని పేర్కొన్నారు. అసెంబ్లీలో నేను వ్యవసాయం, ఇరిగేషన్ ప్రాజెక్టులపై మాట్లాడేటప్పుడు ఐదు నిమిషాల్లో సమస్యలు, కాలువలు, నష్టాలకు సంబంధించిన అంశాలను . సముద్రాన్నంతా చెంబులో పట్టించినట్లు ఐదు నిమిషాల్లో అవగాహన కల్పించే గొప్ప విజ్ఞానవంతుడుని అన్నారు. ఆయన సేవలకు గుర్తుగా వ్యవసాయ రంగంలోని ఏదైనా ఒక విభాగానికి, మల్లారెడ్డి పేరు పెట్టాలన్న ప్రతిపాదనను స్వాగతిస్తున్నామని చెప్పారు.

### ఎర్రజెండాలన్నీ ఒక్కటి కావాలి

సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ వేదికగా ఎర్రజెండాలన్ని ఏకం కావాలని మరోసారి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. 'కేవలం బిజెపిని, ప్రధాని నరేంద్ర మోదీని ఓడించడమే మన లక్ష్యం కాకూడదని మన గెలుపు కూడ ముఖ్యమే అన్నారు. సిద్ధాంతాల పరంగా కమ్యూనిస్టులను ఎవరూ వేలెత్తి చూపలేరని, అలాంటిది భావజాలం, పంథాల పట్టింపులతో విడివిడిగా ఉండటం సరికాదని ఆయన పేర్కొన్నారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీ, ప్రజాపంథా... ఏ పేరైనా సరే, ఎర్రజెండాలన్నీ ఏకమై ఒకటే జెండాగా మారాలని, తద్వారా దేశంలో ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు ఎదగాలని ఆకాంక్షించారు. విభేదాలు వీడి ఐక్యంగా ముందుకెళ్లడమే మల్లారెడ్డి లాంటి మహోన్నత నాయకులకు మనం ఇచ్చే నిజమైన నివాళి' అని పేర్కొన్నారు. ప్రొఫెసర్ కోదండరామ్, వామపక్ష పార్టీల నేతలు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి మల్లారెడ్డి ఆశయాల స్ఫూర్తితో ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి సతీమణి భాగ్యలక్ష్మి , కుమారుడు వాసుదేవరెడ్డి, కుమార్తె సునిత తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఛార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలం

- త్వరలో ఓలా, ఉబర్ తరహాలో ప్రభుత్వ యాప్
- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు
- ఇ.వి ఆటోల ప్రచారం అవాస్తవం: మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆటో ఛార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2012 తర్వాత ఆటో మీటర్ల ఛార్జీలను పెంచలేదని, రవాణా శాఖ అధికారులు, ఆటో సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి ప్రతిపాదనలు రూపొందిస్తామని, కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో ఛార్జీల పెంపును అమలు చేస్తామని చెప్పారు. టిజిఎస్ ఆర్‌టిసి ద్వారా ఇవి ఆటోలను ప్రవేశపెట్టి లాస్ట్‌మైల్ కనెక్టివిటీ అమలు చేయనున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు.

### ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్..

ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ఆటో డ్రైవర్లకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను తీసుకురావడంపై ఐటి శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ఆటోలను పర్యావరణహిత వాహనాలుగా రెట్రోఫిట్‌మెంట్ చేసుకునేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల చొప్పున సుమారు 18,766 ఆటోలకు ఆర్థిక సాయం అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకోసం సుమారు రూ.200 కోట్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

### సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు..

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి, శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రులు తెలిపారు. ప్రమాద, సహజ మరణ బీమా సదుపాయం కల్పించేందుకు ప్రత్యేక బీమా పాలసీపై కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. పెండింగ్, తిరస్కరించిన ఆటో పర్మిట్ల సమస్యలను పరిష్కరించడం, ఇతర జిల్లాల ఆటోలు హైదరాబాద్‌లో తిరగకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయడం, సారథి పోర్టల్‌లో ఆటో లైసెన్స్ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రానికి లేఖ రాయడం వంటి అంశాలపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, అడిషనల్ కమిషనర్ రమేష్, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకటరమణ, కార్మిక శాఖ అధికారులు, పోలీస్, ట్రాఫిక్ అధికారులు, ఆటో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశంతో పాటు వివిధ ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాయదుర్గం వక్ఫ్ భూముల అమ్మకం ఆలోచన విరవించకపోతే ప్రజా ఉద్యమం తప్పదు

మాజీ ఎంపి, ఇన్సాఫ్ జాతీయా అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాషా హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి పేరుతో ముస్లిం మైనార్టీల జామీ నిజామీయా వక్ఫ్ భూములను అమ్మకం ఆలోచన విరమింపజేయాలని లేని ఎడల ఆల్ ఇండియా తంజీ మే ఇన్సాఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ సీనియర్ నాయకులూ, ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు మాజీ ఎంపీ సయ్యద్ పాషా హెచ్చరించారు. ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో సోమవారం ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జరిగిన నిరసన ఆందోళన కార్యక్రమంలో సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా పరిధిలోని సర్వే 23 / 1 గల దాదాపుగా 512 ఎకరాల సర్వేనెంబర్ భూములను ఐదు వేల కోట్లకు అమ్ముకునే కుట్ర జరుగుతుందని ఇప్పటికే ప్రభుత్వం ఆ ప్రయత్నాలు ప్రారంభించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు సచార్ కమిటీ రంగనాథ్ కమిటీలు ముస్లిం మైనారిటీలు దళిత గిరిజనులు కన్నా వెనుకబడి ఉన్నారని చెబుతున్న వాళ్ళ అభివృద్ధికి పాటుపడాల్సిద్దిపోయి తరతరాలుగా వారు కాపాడుకుంటున్నా భూములను ఆస్తులను ప్రభుత్వాలు అమ్ముకోవడం సిగ్గుచేటు అన్నారు త్వరలోనే ఆల్ ఇండియా తంజీమే ఇన్సాఫ్ ఇతర అన్ని మైనార్టీ సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటానికి పూలుకుంటుందని నేతలు హెచ్చరించారు ఇంత పెద్ద ఎత్తున మైనార్టీల ఆస్తులు లాక్కుంటున్న మేమే ముస్లిం మైనార్టీలకు దిక్కు అని దేశం మొత్తం తిరిగి ప్రచారం చేసుకునే ఎంఐఎం పార్టీ నేతలు ఎక్కడ ఉన్నారని వారు ప్రశ్నించారు నగరంలో ఒక ఎప్పి అనేక మంది ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ లతో కూడిన కార్పొరేటర్లతో కూడిన ఎంఐఎం పార్టీ ఎందుకు ఈ అంశంపై తన నోరు ఇప్పుడు లేదని వారు సూటిగా ప్రశ్నించారు ప్రభుత్వాలు ఏ వచ్చినా ఎంఐఎం వారు వారికి చుట్టమైపోతారు అందుకు నిదర్శనమే ఈ భూముల అమ్మక విషయంలో వారి మౌనం అని వారి ఎద్దేవా చేశారు ఢిల్లీలో ఇటీవల జరిగిన పోరాట స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా జంజి జనరేషన్ చేస్తున్న పోరాటాల స్ఫూర్తిగా ముస్లిం సమాజం వద్ద ముందుకు రావాలని రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు ఇతర ప్రజా సంఘాలు కుల సంఘాలన్నీ కూడా ప్రభుత్వ ఈ చర్యలు తీవ్రంగా ఖండించాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్ సామాజిక ఉద్యమకారుడు మునీర్, ముజాహిద్, అడ్వకేట్ అఫ్జల్, మనన్, నాదీమ్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- చర్యల అధికారం స్పీకర్‌దే
- తప్పు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- డిజిపికి హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళుతున్న ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి ప్రవేశించకుండా పోలీసులు అడ్డుకోరాదని హైకోర్టు స్పష్టం చేసింది. సభా నియమావళి, నిబంధనలను ఉల్లంఘించిన సభ్యులపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు మాత్రమే ఉంటుందని, పోలీసులకు ఆ అధికారం లేదని తేల్చి చెప్పింది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ప్రవేశాన్ని అడ్డుకోవడంతోపాటు వారితో దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిజిపిని ఆదేశించింది. తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డిజిపి, పోలీసు కమిషనర్, డిసిపి, సైఫాబాద్ ఎస్‌హెచ్‌ఓతోపాటు స్పీకర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసింది. బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాసయాదవ్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి సోమవారం విచారణ చేపట్టారు. బిఆర్‌ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు వాదిస్తూ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళుతున్న తమ పార్టీ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలను ఎందుకు నిలువరిస్తున్నారో అడిగినా పోలీసులు సమాధానం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిరసనగా నినాదాలు ముద్రించిన నల్లటి టీషర్టులు ధరించిన ఎమ్మెల్యేలపై పోలీసులు దాడికి దిగారని, కొందరు గాయపడగా వైద్యులు చికిత్స అందించారని తెలిపారు. ఒక మహిళా ఎమ్మెల్యే చీర ధరించి ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకున్నారని, మాజీ హోం మంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యే మెడపై చేయి వేసి అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలు అక్కడ ఉన్నప్పటికీ ఒక్క మహిళా పోలీసు కూడా లేదని తెలిపారు. పోలీసుల దురుసు ప్రవర్తనకు సంబంధించిన ఫొటోలను పిటిషన్‌తో పాటు సమర్పించినట్లు చెప్పారు. శాసనసభ నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాల్సి వస్తే అది స్పీకర్ పరిధిలోని అంశమని, పోలీసులకు ఎమ్మెల్యేలపై అలాంటి చర్యలు తీసుకునే అధికారం లేదని బిఆర్‌ఎస్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. గతంలో పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ టీషర్ట్ ధరించి, ప్లకార్డులతో హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నందున ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే అవకాశం ఉందని, ఎమ్మెల్యేలను అడ్డుకోకుండా పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర హోంశాఖ తరఫున న్యాయవాది మహేష్ రాజె వాదిస్తూ శాసనసభ నియమావళి ప్రకారం సభ్యులు బ్యాడ్జీలు ధరించరాదని, స్పీకర్ అనుమతి లేకుండా జెండాలు, చిహ్నాలు, ఇతర ప్రదర్శన వస్తువులను సభలో ప్రదర్శించరాదని తెలిపారు. నల్లటి టీషర్టులపై నినాదాలు ఉండటంతో పోలీసులు అడ్డుకుని ఉండవచ్చని చెప్పగా, న్యాయమూర్తి జోక్యం చేసుకుని చీరలు ధరించి వచ్చిన మహిళా ఎమ్మెల్యేలను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. ఫొటోలను పరిశీలిస్తే ఎమ్మెల్యేల మెడపై చేతులు వేసి గెంటాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించేందుకు గడువు కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం ఎమ్మెల్యేలను శాసనసభలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోరాదని హైకోర్టు ఆదేశించింది. దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకుని ఆ వివరాలతో నివేదిక సమర్పించాలని డిజిపిని ఆదేశించింది. ప్రతివాదులు సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును సస్పెండ్ చేయాలి

టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దళిత స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. సభ్య సమాజం తలదించుకునేలా ఉన్న ఈ వ్యాఖ్య లు ప్రజాస్వామ్య విలువలకు, శాసన వ్యవస్థ గౌరవానికి విరుద్ధమని ఆయ న పేర్కొన్నారు. శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన, అవమానకర వ్యాఖ్యలు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ తాతా మధు తన వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసన మండలి నిబంధనల ప్రకారం తాతా మధుపై కఠిన చర్యలు తీసుకుని, ఆయనను సస్పెండ్ చేయాలని మహేష్ కుమార్ గౌడ్ కోరారు. ప్రతిపక్ష నేతగా వ్యవహరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ ఘ టనపై స్పందించి, తాతా మధు వ్యాఖ్యలను ఖండించడంతో పాటు దళిత స మాజానికి, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నుంచి సహకారం లేదు

గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం
దసరా నాటికి 2 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి
శాసనమండలిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదని పొంగులేటి విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు గ్రామీణ ప్రాంతాల్లో లక్షలు, రెండు లక్షల చొప్పున ఇళ్లు మంజూరు చేస్తున్న కేంద్రం.. తెలంగాణకు మాత్రం ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తాను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు కలిసి తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని కోరినా ఆశించిన స్పందన రాలేదని తెలిపారు. పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసి, గుడిసెలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ పేదలకు ఇళ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపై శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. స్థలాల కొరతను దృష్టిలో ఉంచుకుని జిహెచ్‌ఎంసి పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ తరహాలోనే నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర మున్సిపల్ కార్పొరేషన్లలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తామని వెల్లడించారు. పట్టణ పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. తొలి విడతలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 3,75,750 ఇళ్లకు కలెక్టర్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారని, 3,28,070 ఇళ్లు గ్రౌండ్ అయినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,97,537 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, దసరా నాటికి 2 లక్షల ఇళ్లను పూర్తి చేస్తామని ప్రకటించారు.

### ఈ నెల 20లోగా రెండో విడత..

రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల చొప్పున 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పొంగులేటి తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మంజూరు చేసినప్పటికీ వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయిన ఇళ్లకు ఈ విడతలో ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఈ నెల 20లోగా రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు రాయితీపై రూ.230కే సిమెంట్ బస్తాను అందిస్తున్నామని మంత్రి తెలిపారు.
త్వరలో పరిశ్రమల శాఖ మంత్రితో కలిసి స్టీల్ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి, పేదలకు రాయితీపై స్టీల్ అందించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన అసంపూర్తి 2బీహెచ్‌కే ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఆయా కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పిస్తున్నామని చెప్పారు.